
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 98 వ భాగం

# భగవంతుడి అవతారాలు

క్రితం వ్యాసంలో ధర్ముడికి దక్ష ప్రజాపతి కూతురువల్ల నరనారాయణులు పుట్టారని బ్రహ్మ నారదుడితో భగవంతుడి అవతారాల గురించి చెప్తూ వివరించాడని చదివాం. ఈ నర, నారాయణుల్లో ఒకరు తపస్సు చేస్తూంటే రెండోవారు ఈ సహస్ర కవచుడు అనే రాక్షసుడితో యుద్ధం చేసేవారుట. అలా వాడికున్న వేయి కవచాలలో ఒక్కటి తప్ప అన్నీ ఛేధించేసారు. వాడు మిగిలి ఉన్న ఒక్క కవచంతో సహజ కవచ కుండలాలు ఉన్న కర్ణుడిగా పుట్టాడనీ, ఆ కవచం ఛేధించి వాణ్ణి చంపడానికి నరనారాయణులే కృష్ణార్జునులుగా పుట్టారనీ కథ.

క. అనఘులు బదరీవనమున
వినుత తపోవృత్తి నుండ, విబుధాధిపుఁడున్
మనమున నిజపదహానికి
ఘనముగఁ జింతించి దివిజకాంతామణులన్. [2-126]

ఈ నరనారాయణులు బదరికావనంలో తపస్సు మొదలు పెట్టారు. ఎవరైనా తపస్సు చేస్తూంటే ఇంద్రుడికి కాస్త అనుమానం కదా, తన సింహాసనానికి ఎసరు పెడుతున్నారేమో అని? అందువల్ల ఆయన అప్సరసలని పిలిచాడు.

క. రావించి తపోవిఘ్నముఁ
గావింపుం డనుచు బనుపఁ గడు వేడుకతో
భావభవానీకిను లనఁ
గా వనితలు సనిరి బదరికావనమునకున్. [2-127]

'ఇదిగో వీళ్ళిద్దరూ ఇలా తపస్సు మొదలు పెట్టారు, వెళ్ళి ఆ తపస్సు పాడుచేయండి' అని చెప్పాడు. దీని అర్థం ఏమంటే, మనసులో ఎప్పుడైతే జిజ్ఞాస మొదలౌతుందో అప్పుడే పక్కనుంచి కామ, క్రోధ, మద, మాత్సర్యాలనేవి విజృంభించి ఆ తపస్సు పాడు చేయడానికి పూనుకుంటాయి. వాటిని జయించకుండా మోక్షం అసాధ్యం కదా? ఈ అప్సరసలు అనేవి మన మనసులో కోరికలూ వగైరా అని అర్థం చెప్పుకోవచ్చు. అవి ఒక్కసారి మనసులో చొరబడగానే వాటిని వదిలించుకోవడం అంత సులభం కాదు. ఎంతో మనోనిగ్రహం ఉన్నవారు కూడా ఈ చెడు గుణాలకి లోబడి అధోగతిలో పడడం చూస్తూన్న కథే. విశ్వామిత్రుడు కూడా మేనకని చేరదీయడం కొంతకాలం తర్వాత ఆవిడని స్వర్గానికి పంపేసి తన తప్పు తెలుసుకోవడం అవీ మనకి తెలిసిన కథలే.

మ. నరనారాయణు లున్న చోటికి మరున్నారీ సమూహంబు భా
స్వరలీలం జని రూప విభ్రమ కళా చాతుర్య మేపారఁగాఁ
బరిహాసోక్తుల నాటపాటలఁ జరింపం జూచి నిశ్చింతతన్
భరితధ్యాన తపః ప్రభావ నిరతిం బాటించి నిష్కాములై. [2-129]

ఈ నారీ సమూహం వచ్చింది నరనారాయణులు తపస్సు చేసేచోటికి. తపస్సు చేసే వీళ్ళని చూసి పలకరించి ఏవో పరిహాసంతో కబుర్లూ అవి చెప్పి తపస్సు మీదనుండి వాళ్ల మనస్సులు చెడగొట్టడానికి ప్రయత్నం ఆరంభించారు. కానీ ఈ నరనారాయణులు ఎటువంటివారు? మనస్సు మీద ఎంతో నిగ్రహం ఉన్నవాళ్ళు, నిశ్చింతగా కోరికలన్నీ వదిలేసిన తపోధీనులు. ఈ అప్సరసలని పట్టించుకోనేలేదు.

క. క్రోధము దమ తపములకును
బాధక మగు టెఱిఁగి దివిజభామలపై న
మ్మేధాత్మకు లొక యింతయు
క్రోధముఁ దేరైరి సత్త్వగుణయుతు లగుటన్. [2-130]

ఎందుకిలా వచ్చినవాళ్లని పట్టించుకోలేదు? కోపం తెచ్చుకుంటే వచ్చే సాధక బాధకాలు బాగా తెలుసు కనక. "ధ్యాయతో విషయాన్పుంసః సంగస్తేషూ పజాయతే, సంగాస్తంజాయతే కామః, కామాత్క్రోధోభి జాయతే, క్రోదాద్భవతి

సమ్మోహః, సమ్మోహా స్మృతి విభ్రమః, స్మృతి భ్రంశా బుద్ధినాశో, బుద్ధినాశా త్ప్రణశ్యతి," (భగవద్గీత 2.63) అని కృష్ణుడు భగవద్గీతలో చెప్పినదే కదా?

క. నారాయణుఁ డప్పుడు దన
యూరువు వెసఁ జీఱ నందు నుదయించెను, బెం
పారంగ నూర్వశీ ముఖ
నారీజనకోటి దివిజనారులు మెచ్చన్. [2-131]

తమ తపస్సు పాడుచేయబోయే ఈ భామలకి బుద్ధి చెప్పదానికి నారాయణుడు తన తొడ గోటితో చీరేసరికి అందులోంచి ఒక అద్భుతమైన సౌందర్యరాశి బయటకి వచ్చింది; ఆవిడతో పాటు మరి కొంతమంది అప్సరసలు కూడా. ఊరువు (తొడ) లో పుట్టింది కనక ఆవిడకి ఊర్వశి అని పేరు. 'ఈవిడని తీసుకుని వెళ్ళిపొండి ఇక్కడనుంచి' అన్నారు వాళ్లు ఈ అప్సరసలతో.

క. ఊరువులందు జనించిన
కారణమున నూర్వశి యన ఘనతకు నెక్కెన్
వారల రూప విలాస వి
హారములకు నోడి రంత నమరీజనముల్. [2-132]

వ. అంతం దాము నరనారాయణుల తపోవిఘ్నంబు గావింపంబూని చేయు విలాసంబులు, మానసికసంకల్ప మాత్రంబున సృష్టి స్థితి సంహారంబు లొనర్పంజాలు నమ్మహాత్ముల దెసం బనికిరాక కృతఘ్నునకుం జేఁయు నుపకృతులుంబోలె నిష్ఫలంబులైన సిగ్గునఁ గుందుచు, నూర్వశిం దమకు ముఖ్యురాలింగాఁ గైకొని తమ వచ్చిన జాడన మరలి చని రంత. [2-133]

మానసిక సంకల్ప మాత్రం చేత సృష్టి, స్థితి, లయాలు చేసే నేర్పు ఉన్న మహాత్ముల దగ్గిర తమ వెర్రి వేషాలూ, పరిహాసం అనేవి కృతఘ్నులకి చేసే ఉపకారం వలే పనికిరావని తెలిసి వచ్చాక, ఊరువుల్లో పుట్టిన కారణం చేత ఊర్వశి అని పిలవబడే ఆవిడని కూడా తీసుకుని వచ్చినవాళ్ళందరూ తిరిగివెళ్ళారు.

క. కాముని దహించెఁ గ్రోధమ
హామహిమను రుద్రుఁ; డట్టి యతికోపము నా
ధీమంతులు గెలిచి రనం;
గామము గెలుచుటలు సెప్పఁగా నేమిటికిన్. [2-134]

నరనారాయణులు కోపం జయించగలిగారు ఆ విధంగా, అని శుకమహర్షి చెప్తూ ఇంకా అంటున్నాడు పరీక్షిత్తుతో – క్రోధం వల్ల శివుడు మన్మథుణ్ణి బూడిద చేసాడు కదా? దానివల్ల క్రోధం వల్ల ఎంతటి అపాయం కలుగుతుందో తెలిసిన ధీమంతులు ఈ నరనారాయణులు; వీరు కోరికలు జయించడం గొప్ప విషయం కాదు కదా?

వ. అట్టి నరనారాయణావతారంబు జగత్పావనంబై విలసిల్లె; వెండియు ధ్రువావతారంబు వివరించెద వినుము. [2-135]

సీ. మానిత చరితుఁ డుత్తానపాదుం డను
భూవరేణ్యునకు సత్పుత్రుఁ డనగ
నుదయించి మహిమఁ బెంపొంది బాల్యంబున
జనకుని కడనుండి సవితితల్లి
దను నాడు వాక్యాస్త్రతతిఁ గుంది మహిత త-
పంబు గావించి కాయంబుతోడఁ
జని మింట ధ్రువపదస్థాయి యై యటమీఁద
నర్థి వర్తించు భృగ్వాది మునులుఁ [2-136]

తే. జతురగతి గ్రింద వర్తించు సప్తఋషులుఁ
బెంపు దీపింపఁ దన్ను నుతింప వెలసి
ధ్రువుఁడు నా నొప్పి యవ్విష్ణుతుల్యుఁ డగుచు
నున్న పుణ్యాత్ముఁ డిప్పుడు నున్నవాఁడు. [2-136.1]

బ్రహ్మ ధృవుణ్ణి కూడా భగవంతుడి అవతారంగానే వివరిస్తున్నాడు. ఉత్తానపాదుడికి పుట్టిన పెద్దకొడుకు ధృవుడు. సవితి తల్లి పరుషమైన వాక్యాలు అనేసరికి (వాక్యాస్త్ర) మహోన్నితమైన తపస్సు చేసి సశరీరంగా భగవంతుడి పదం అందుకున్నాడు. పైన ఉండే భృగువు తో పాటు ఉండే మునులతో, ఆ ధృవపదం కిందనే సప్త ఋష మండలం ఉండేది. రాటకి కట్టినట్టూ విశ్వం అంతా ఆ ధృవపదం చుట్టూ తిరుగుతోంది.

విషయం గమనించారా? ఎప్పుడైతే ఒకరు తపస్సు చేసి భగవంతుణ్ణి చేరుకున్నారో వాళ్ళు భగవంతుడిలో ఐక్యం కనక భగవత్స్వరూపులే. ఇదే రామకృష్ణులు చెప్పిన ఉప్పుబొమ్మ సముద్రం లోతు కొలవడం అనే విషయం. విష్ణువు భగవంతుడిలో ఓ అంశ మాత్రమే. 'ఆదిత్యానామహం విష్ణుః' అని భగవద్గీతలో చెప్పడం కూడా గమనించవచ్చు. ఏ రూపులో చూస్తే ఆ రూపులో మనకి కనిపించేవాడు భగవంతుడు – ఇదే సర్వత్రా ఉన్న చైతన్యం; హరి మయము విశ్వమంతయు. అయితే ఒక్కో అవతారం భగవంతుడి స్వరూపం అని నమ్మడం ఎలా అంటే, యధాయధాహి ధర్మస్య అనే గీతా శ్లోకమే దానికి సమాధానం.

ఉ. వేనుఁడు విప్రభాషణ పవిప్రహతిచ్యుత భాగ్యపౌరుషుం
డై నిరయంబునం బడిన నాత్మ తనూభవుఁడై పృథుండు నాఁ
బూని జనించి తజ్జనకుఁ బున్నరకంబును బాపె; మేదినిన్
ధేనువుఁ జేసి వస్తువితతిం బితికెన్ హరి సత్కళాంశుఁడై. [2–138]

ఈ పద్యంలో వివరించేది పృధువు గురించి. వేనుడనే ఆయనకి పృధువు పుట్టాడు; తండ్రికి మంచి గుణాలు లేవు. అయినా సరే పృధువు భూమిని దున్ని ఔషధాలని తీసి ఉద్ధరించడం చేత సత్కీర్తితో భగవంతుడిగా కీర్తించబడ్డాడు. అలా ఆయన చేసిన మంచి పనుల వల్ల తండ్రికి ఉన్న చెడ్డపేరు పోగొట్టాడు.

వ.అని మఱియు "వృషభావతారంబు నెఱిఁగింతు; వినుము; ఆగ్నీంధ్రుండను వానికి "నాభి" యనువాఁ డుదయించె; నతనికి మేరుదేవి యను నామాంతరంబు గల "సుదేవి" యందు హరి వృషభావతారంబు నొంది జడస్వభావంబైన యోగంబు దాల్చి ప్రశాంతాంతఃకరణుండును, బరిముక్త సంగుండునునై పరమహంసాభిగమ్యం బయిన పదం బిది యని మహర్షులు వలుకుచుండం జరించె; మఱియు హయగ్రీవావతారంబు సెప్పెద వినుము. [2–139]

తర్వాత అవతారం వృషభావతారం. అగ్నీంద్రుడు అనే ఆయనని నాభి అనేవాడు పుట్టాడు. ఆయనకీ సుదేవి అనే ఆవిడకీ (ఆవిడ వేరు నామం మేరుదేవి) భగవంతుడు వృషభావతారంగా పుట్టాడు. ఆయన శాంతం అలవర్చుకొని. ప్రాపంచిక విషయాలన్నీ పరిత్యజించి భగవంతుణ్ణి భజిస్తూ ఆయన్నే చేరుకున్నాడు. 'ఇదే పరమంసలు పాటించవల్సిన మార్గం' అని మహర్షులందరూ పలికారు. తర్వాతది హయగ్రీవావతారం. ఈ అవతారంలో హయగ్రీవుడనే పేరుతో పుట్టాడు భగవంతుడు.

చ. అనఘచరిత్ర! మన్మఖము నందు జనించె హయాననాఖ్యతన్
వినుత సువర్ణ వర్ణుఁడును వేదమయుం డఖిలాంతరాత్మకుం
డనుపమ యజ్ఞపూరుషుఁడునై భగవంతుఁడు దత్సమస్త పా
వనమగు నాసికాశ్వసనవర్గములం దుదయించె వేదముల్. [2-140]

బ్రహ్మ చేసిన యజ్ఞంలోంచి బంగారు కాంతితో వేద స్వరూపుడై సర్వాంతర్యామి అయిన భగవంతుడు హయగ్రీవుడనే పేరుతో పుట్టాడు. ఆయన నాసికలోంచి శ్వాశవాయువులుగా వేదాలు ఉద్భవించాయి. వేదాలు భగవంతుడి నుంచి ఉద్భవించాయనీ (నిగమంబు మత్స్వరూపంబు – వేదమే నా స్వరూపం) అపౌరుషేయాలనీ చెప్పడానికి కారణం ఇదే. మిగతా అవతార వివరణలు వచ్చే వ్యాసంలో.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS